పార్లమెంటు ఎన్నికల్లో.. నోడల్ అధికారులదే కీలక పాత్ర

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

సమావేశంలో ఎన్నికల నిర్వహణ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : రానున్న పార్లమెంటు ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులదే కీలక పాత్ర అని రంగారెడ్డి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శశాంక అన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకై నియమించిన నోడల్ అధికారులతో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నోడల్ అధికారులందరూ వారికి కేటాయించిన అంశాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పార్లమెంటు ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. అన్ని విషయాలపై నోడల్ టీములకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. మొదటి ర్యాండమైజేషన్ తర్వాత పీవో, ఏపీవోలకు కూడా శిక్షణ ఇవ్వాలన్నారు. పట్టణ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సంబంధిత స్వీప్ నోడల్ అధికారికి సూచించారు. పార్లమెంటు ఎన్నికల్లో విధులు నిర్వహించుటకు సిబ్బందికి సంబంధించిన ఇంటి చిరునామాలు, ఎపిక్ కార్డుల వివరాలు తప్పనిసరిగా అందించాలని, ఇంకా వివరాలు అందించని శాఖలవారు వెంటనే జిల్లా పరిశ్రమల శాఖకు అందించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, సీపీబో సౌమ్య, డీసీసీవో ధాత్రీదేవి, డీపీవో సురేశ్ మోహన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్, ఎన్నికల విభాగం అధికారి సైదులు ఉన్నారు.

పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయంలో ఫైళ్లను తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

భూ సమస్యలను పరిష్కరించాలి

- ఈ నెల 17 వరకు ధరణి స్పెషల్ డ్రైవ్
- వికారాబాద్ జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్
- పెద్దేముల్ మండల తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ
- స్పెషల్ డ్రైవ్ ఫైళ్ల పరిశీలన

పెద్దేముల్, మార్చి 14 : ధరణి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను అత్యంత పారదర్శకంగా పకడ్బందీగా విచారించి పెండింగ్ సమస్యలను పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. గురువారం పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్ట్రేషన్, ఎమ్మార్వో, డీటీ, ఆర్ఐ, రికార్డు రూమ్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వీసీ రూమ్‌లను పరిశీలించి కార్యాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. అనంతరం కార్యాలయంలో ధరణి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పరిశీలిస్తున్న భూ సమస్యల ఫైళ్లను పరిశీలించారు.

ఫైళ్లను క్లియర్ చేయాలి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17 వరకు ధరణి స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న జీఎల్ఎం, ఖాతా మెర్జ్, సక్సేషన్, మ్యుటేషన్, టీఎమ్-33, నాలా విత్ అవుట్ పీపీబీ, జీపీఏ, ఆర్ఎస్ఆర్ టైటిల్ క్లియర్ ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా మండలంలో సర్వే పిటిషన్‌లను దశలవారీగా కూలంకషంగా పరిశీలించి సర్వే పూర్తి చేసి క్లియర్ చేయాలని సర్వేయర్‌కు సూచించాలని ఎమ్మార్వోను ఆదేశించారు. ధరణిలో జీఎల్ఎంతోపాటు అన్ని రకాల భూ సమస్యల ఫైళ్లను పరిశీలించి గ్రామాల్లో మోఖా పంచనామా నిర్వహించి కబ్జాలో ఉన్నారో? లేరో? పరిశీలించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్ఎస్ఆర్ ఎక్స్‌లో భాగంగా ఎక్కువ విస్తీర్ణం కలిగిఉన్న సర్వే నంబర్లను, వాటి పాత రికార్డులను పరిశీలించిన పిదప వాటిని తొలగించిన తరువాత భూ సమస్యల ఫైళ్లను క్లియర్ చేయాలని సూచించారు. తదుపరి ప్రతి రోజూ కార్యాలయంలో ఎన్ని రిజిస్ట్రేషన్ స్లాట్‌లు బుక్ అవుతున్నాయి? సిబ్బంది కార్యాలయంలో అందరూ ఉన్నారా? రికార్డు రూమ్‌లో ఫైల్స్‌ను ఎందుకు కింద పెడుతున్నారు? ర్యాక్స్ లేవా? ఎలక్షన్ వర్క్ ఏ రూమ్‌లో చేస్తున్నారు? అనే విషయాలను ఎమ్మార్వో కిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సమయంలో డీటీ మహేశ్‌కుమార్, ఆర్ఐ రాజు రెడ్డి, జూనియర్ అసిస్టెంట్‌లు అవినాష్, మహేశ్, భాగ్యలక్ష్మి, లక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్లు బసంతిరెడ్డి, ముస్తఫా ఉన్నారు.

ఎఫ్‌టీవో జనరేట్ చేయాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 14 : జిల్లాలో ఇప్పటికే మంజూరై వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ఎఫ్‌టీవో జనరేట్ చేయాలని సంబంధిత అధికారులకు వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో జరిగే సీసీ రోడ్ల నిర్మాణ పనులు, ఫిజికల్ వర్క్ కంటిన్యూ చేస్తూ ఇప్పటికే పూర్తయిన వాటికి ఎఫ్‌టీవో జనరేట్ చేయాలని, సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో అజాగ్రత్త వహించకుండా ఏఈలు, డీఈలు అదనంగా టైం తీసుకొని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మండలాలవారీగా సీసీ రోడ్ల నిర్మాణ పనుల పురోగతికి సంబంధించి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డీఈలు పాల్గొన్నారు.

8 మంది విద్యార్థులు డిబార్

వికారాబాద్ జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

వికారాబాద్/పెద్దేముల్, మార్చి 14 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో భాగంగా పన్నెండో రోజు శుక్రవారం మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న 8 మంది విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైనట్లు వికారాబాద్ జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ గురువారం తెలిపారు. పెద్దేముల్ పరీక్షా కేంద్రంలో కాపీ చేస్తున్న 6గురిని, అదేవిధంగా కోకట్‌లోని పరీక్షా కేంద్రంలో ఇద్దరు విద్యార్థులను తెలంగాణ ఇంటర్ బోర్డు పరిశీలకులు డిబార్ చేసినట్టు ఆయన తెలిపారు. జనరల్ కోర్సుల్లో 6,447 మందికి 6,301 మంది విద్యార్థులు.. అదేవిధంగా ఒకేషనల్ కోర్సుల్లో 1,298 మందికి 1,255 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు. జనరల్ కోర్సులకు సంబంధించిన పరీక్షలు సజావుగా ముగిసాయని అన్నారు. ఒకేషనల్ పరీక్షలు మరో రెండు రోజులు కొనసాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

భూవివాదం.. బీభత్సం

- సెటిల్‌మెంట్ కోసం వచ్చి ప్రహరీ ధ్వంసం
- పని చేస్తున్న కూలీలపై దాడి.. గుడిసెలకు నిప్పు
- 38 మందిపై కేసు నమోదు..

ఐదుగురికి రిమాండ్.. పరారీలో మరికొంత మంది

ఆదిబట్ల, మార్చి 14 : రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నం.32లో రెండు ఎకరాల 17 గుంటల స్థలానికి సంబంధించిన వివాదంలో ఆదిబట్ల పోలీస్‌స్టేషన్లో 38 మందిపై కేసు నమోదైన ఘటన పది రోజుల తరువాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఓఎస్ఆర్ గ్రూప్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన పోలీసులు 38 మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడ గ్రామంలోని సర్వే నం.32లో గల 2 ఎకరాల 17 గుంటల భూమిలో ఓఎస్ఆర్ గ్రూపునకు సంబంధించిన నిర్మాణాలను ఈ నెల 3న కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావు తన అనుచరులు 38 మందితో వచ్చి ధ్వంసం చేశాడు. ఈ స్థలానికి సంబంధించిన కేసులో మొదట ఓనర్ జక్కిడి సురేందర్‌రెడ్డి ఏ1గా చేర్చడంతో పాటు ఏ2గా జక్కిడి హరినాథ్, ఏ3గా శివ, ఏ4గా కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావు, ఏ5గా డేనియల్‌తో పాటు మరో 33 మంది వారి అనుచరులపై 307, 447, 427, 436, 148, 149 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశామన్నారు.

ఈ భూమి తొలుత జక్కిడి సురేందర్‌రెడ్డికి చెందినది. అతడు 2013లో తన అవసరనిమిత్తం రూ.50లక్షలకు చావ సురేశ్‌కు ఏజీపీఏ చేశాడు. సురేందర్‌రెడ్డి సురేశ్‌కు డబ్బులు చెల్లించకపోవడంతో 2020లో సురేశ్ ఓఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావుకు సేల్ డీడ్ డాక్యుమెంట్ చేశాడు. దీంతో శ్రీనివాస్‌రావు తాను కొనుగోలు చేసిన భూమికి తన సిబ్బందితో కంపౌండ్‌వాల్ పనులు చేపట్టాడు. సురేందర్‌రెడ్డి గతంలో తన అన్నాదమ్ముళ్లతో కలిసి శ్రీనివాస్‌రావును ఇబ్బందులకు గురి చేయడంతో పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. దీంతో తన భూమిని ఎలాగైనా కబ్జాలోకి తీసుకోవాలనే ఆలోచనతో సురేందర్‌రెడ్డి తన బావ బొల్లారం కౌన్సిలర్ చంద్రారెడ్డిని కలిశాడు. అతడి సహకారంతో రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్ చేసే కల్వకుంట్ల తేజేశ్వరరావు అలియాస్ కన్నారావును రెండు కోట్ల రూపాయలకు సెటిల్‌మెంట్ మాట్లాడుకుని 40 లక్షల రూపాయలు అడ్వాన్స్ ఇచ్చి రంగంలోకి దింపారు. ఈ నెల 3న తెల్లవారుజామున కన్నారావు తన అనుచరులు 40 మందితో కలిసి ఓఎస్ఆర్ గ్రూప్ నిర్మాణాలపై దాడికి దిగారు. ఈ దాడిలో భూమి చుట్టూ ఏర్పాటు చేసిన కంపౌండ్‌వాల్‌ను జేసీబీతో ధ్వంసం చేశారు. అక్కడ పని చేస్తున్న కొంత మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆ స్థలంలో వేసి గుడిసెలకు నిప్పుపెట్టి పెద్దఎత్తున బీభత్సం సృష్టించారు. దీంతో శ్రీనివాస్‌రావు తమ భూమిలోకి అక్రమంగా చొరబడి దాడికి పాల్పడిన కన్నారావు అతడి అనుచరులపై ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసుకు సంబంధించి సుదీర్ఘంగా పది రోజుల పాటు విచారణ జరిపిన పోలీసులు ఇప్పటికే ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో 33 మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఈ దాడికి ప్రధాన కారకుడైన కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావుతో పాటు మరో 33 మంది నిందితుల కోసం ప్రత్యేకంగా 3 పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీ చేస్తున్నామని సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. కన్నారావు ప్రస్తుతం బెంగళూరులో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. త్వరలోనే వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని సీఐ పేర్కొన్నారు.

దాడి చేసి నిప్పు పెట్టడంతో తగులబడుతున్న గుడిసెలు

రోడ్ల అభివృద్ధికి రూ.850 కోట్లు

31 రాష్ట్ర రహదారులను 435 కి.మీ. మేర అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో 31 రాష్ట్ర రహదారుల విస్తరణ, ఆధునికీకరణ పనుల కోసం కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ రూ.850 కోట్లు మంజూరు చేసింది. సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఎఫ్ఐ) కింద రాష్ట్రానికి నిధులు కేటాయించింది. ఈ నిధులతో 31 రహదారులను 435.29 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. దీనివల్ల రాష్ట్రంలో స్థానిక పర్యాటకం, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని కేంద్ర రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. రోడ్లకు రూ.801.28 కోట్లు, వంతెనలకు రూ.335.30 కోట్లు కలిపి మొత్తం రూ.1,136.58 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించారు. ఈ నేపథ్యంలో కేంద్ర రహదారుల మంత్రిత్వశాఖ గురువారం సీఆర్ఎఫ్ఐ కింద రూ. 850 కోట్లు మంజూరు చేసింది.

డబుల్ లేన్ రోడ్లుగా ప్రతిపాదించిన రోడ్ల వివరాలు

- వికారాబాద్ నియోజకవర్గంలో వికారాబాద్-తాండూరు రోడ్డు, తాండూరు-కొత్తపల్లి రోడ్డు, తాండూరు బస్టాండ్-సెంట్ మార్క్స్ హైస్కూల్.
- పరిగి నియోజకవర్గంలో చిట్టెంపల్లి-లాల్‌పహాడ్ రోడ్డు
- రంగారెడ్డి జిల్లా కల్వకుర్తిలో కడ్తాల్‌గేట్-పడకల్‌గేట్

ధ్యానం, సంగీతంతో మానసిక ప్రశాంతత

- హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ డి పటేల్
- కన్హాలో ప్రారంభమైన ఆధ్యాత్మిక మహోత్సవం
- ఆకట్టుకున్న ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు

కన్హా శాంతివనం ధ్యాన కేంద్రం

సంగీత కచేరి నిర్వహిస్తున్న ప్రముఖ గాయకుడు శంకర్ మహాదేవన్ బృందం

నందిగామ, మార్చి14 : ధ్యానంతో పాటు సంగీతంతో కూడా మానసిక ప్రశాంతత లభిస్తుందని హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ డి పటేల్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతి వనంలో శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సమ్మేళనంలో మొదటి రోజు గురువారం ప్రముఖ గాయకుడు శంకర్ మహాదేవన్ కచేరి వహించి అందరినీ అకట్టుకున్నారు. ఈ సందర్భంగా హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ పటేల్ మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక సమ్మేళనం ప్రపంచ శాంతికి ఎంతో దోహదపడుతుందని.. అన్ని మతాలకు సంబంధించిన గురువులు, మేధావులు పాల్గొంటున్నారని తెలిపారు. ప్రపంచ దేశాల నుంచి వచ్చిన ప్రముఖులు, అభ్యాసకులతో కన్హా శాంతి వనంలో పండుగ వాతావరణం నెలకొన్నది.

నేడు కన్హాకు రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రమైన కన్హా శాంతివనంలో గురువారం ప్రారంభమైన అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనానికి శుక్రవారం ముఖ్య అతిథిగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా, శనివారం ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాల నుంచి 300కు పైగా ఆధ్యాత్మిక సంస్థలు, పలువురు ప్రముఖులు హాజరవనున్నారు. ఈ కార్యక్రమం ప్రపంచంలోని అన్ని విశ్వాసాలు, మతాలకు చెందిన ఆధ్యాత్మిక పెద్దలను ఒక చోటికి తీసుకురానున్నది. ప్రపంచ శాంతి కోసం అన్ని మతాలను ఏకతాటిపైకి తీసుకురావడానికి ఈ సమ్మేళనం ఎంతగానో ఉపయోగపడుతుంది. విశ్వ ఆధ్యాత్మిక సమ్మేళనాన్ని (గ్లోబల్ స్పిరిచ్యువాలిటీ మహోత్సవ్ 2024) రాష్ట్రపతి శుక్రవారం ప్రారంభించనున్నారు.

దేశ, విదేశాల నుంచి ప్రముఖుల రాక..

ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి చినజీయర్ స్వామి, అభిజిత్ హెల్డర్, ఆచార్య ధీరేంద్ర కృష్ణశాస్త్రి, రాందేవ్ బాబా, భావ జైన్, బీకే మృత్యుంజయ, కమలేశ్ పటేల్, దస్తూరీజీ, ఖుర్షద్, దేవీ చిత్రలేఖ, స్వామి చిదానంద్, జగద్గురు, రామభద్రాయచారి, మాతా అమృతామయి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్‌తోపాటు సినీ ప్రముఖులు హాజరుకానున్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అభ్యాసకులు

నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి

మహిళా ప్రాంగణం రంగారెడ్డి జిల్లా మేనేజర్ శైలకుమారి

మొయినాబాద్, మార్చి 14 : గ్రామీణ ప్రాంతంలో ఉండే నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించనున్నామని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా మేనేజర్ శైలకుమారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని అల్వాల్, కర్మన్‌ఘాట్, గచ్చిబౌలి, బాచుపల్లి, బీఎన్‌రెడ్డినగర్, కూకట్‌పల్లి, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో ఉన్న రిలయన్స్ రిటైల్, స్టార్ బజార్, రత్నదీప్ సూపర్‌మార్కెట్, కేఎస్ బేకరీల్లో పని చేయడానికి ఆసక్తి ఉన్న నిరుద్యోగ మహిళలు ముందుకు వస్తే వారికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నామని తెలిపారు. 18 నుంచి 35 ఏండ్ల వయస్సు ఉన్నవారు ఇంటర్, పదో తరతి చదివి ఉండాలని చెప్పారు. విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంక్ వివరాలు, మొబైల్ నంబర్‌లతో చిలుకూరులోని మహిళా ప్రాంగణంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7660022524ను ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని తెలిపారు. ఎంపికైనవారికి నెలకు వేతనం రూ.16 వేలు ఇవ్వనున్నట్లు ఆమె చెప్పారు.

బీ అలర్ట్..

- వేసవి తాపం.. నిర్లక్ష్యం చేస్తే అనారోగ్యమే..
- సలహాలు, సూచనలు పాటించాలంటున్న వైద్యనిపుణులు

షాబాద్, మార్చి 14 : వేసవిలో పెద్దలు మొదలుకొని చిన్నపిల్లల వరకూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. లేకపోతే తీవ్ర ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. వేసవి వచ్చిందంటే చాలు అందరి మనస్సు చల్లని పానీయం కోరుకుంటుంది. దప్పిక తీర్చుకునేందుకు కూల్ డ్రింక్స్, పండ్ల రసాలు, లస్సీ వంటి చల్లని పానీయాలను ఆశ్రయిస్తారు. కొబ్బరిబోండం, చెరుకు రసంతోపాటు నిమ్మ, బత్తాయి, ద్రాక్ష, పైనాపిల్, ఆపిల్, మ్యాంగో తదితర పండ్ల రసాలను తీసుకుంటారు. మెయిన్ రోడ్లు, చౌరస్తాల్లో శీతల పానీయాల అమ్మకాలు ఇప్పటికే జోరందుకున్నాయి. పండ్లతో తయారు చేసే పానీయాల తయారీలో పరిశుభ్రత చర్యలు చేపట్టకపోతే అనారోగ్యం కొనితెచ్చుకోవడం ఖాయం. ఎండలో బయటకు వెళ్లిన వారు తమ అలసటను తీర్చుకునేందుకు కళ్ల ముందున్న శీతల పానీయాలను తాగాలని చూస్తారే తప్ప శుభ్రత విషయం గురించి అంతగా ఆలోచించరు.

కలుషితమైతే అనారోగ్యమే..

సాధారణంగా సంక్రమించే వివిధ వ్యాధులకు కలుషితమైన నీరే మూల కారణం. ప్రస్తుతం నల్లాల్లో సరఫరా అయ్యే నీరు కలుషితరహితమన్న గ్యారెంటీ ఏమీలేదు. తోపుడు బండ్లపై, జ్యూస్ సెంటర్లలో తయారవుతున్న పండ్ల రసాలు, లస్సీ తదితర చల్లని పానీయాలు తయారీకి బోరు నీటినే వినియోగిస్తున్నారు. దీనికి తోడు చల్లదనం కోసం పళ్ల రసాల్లో, లస్సీల్లో ఐస్ ముక్కలు వేస్తుంటారు. అయితే ఉపయోగించే ఐస్‌ముక్కలు సురక్షితమైన నీటితో తయారు చేశారన్న నమ్మకమేమీ లేదు. ఇలాంటి విషయాల్లో జాగ్రత్తలు తీసుకోకపోతే రోగాలు కొని తెచ్చుకోవడమేనని వైద్యులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి

ఎండలో బాగా తిరిగిన వెంటనే చల్లని నీరు, పానీయాలు తీసుకోకూడదు. వేడెక్కిన శరీరం తీసుకునే చల్లని పానీయాల ప్రభావంతో ఒక్కసారిగా చల్లబడుతుంది. శరీరమంతా ఇది ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. గుండెపోటు వంటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలుంటాయి. వేసవిలో రోజుకు 5 నుంచి 6 లీటర్ల నీటిని తాగాలి. ఫ్రిజ్‌లో నీటి కన్నా కుండలో నీటిని తాగడం ఆరోగ్యగానికి ఎంతో మేలు చేస్తుంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే వేసవిలో ఆరోగ్యంగా ఉండవచ్చు.

- డా. దామోదర్, జిల్లా ఉప వైద్యాధికారి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

* సాధ్యమైనంత వరకు ఎండలో తిరగడాన్ని తగ్గించాలి. అవసరమనుకుంటే గొడుగును వెంట తీసుకెళ్లాలి. కాటన్ దుస్తులు, తలపై టోపీ ధరిస్తే వేసవి తాపం నుంచి తేరుకోవచ్చు. ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలను ఎండలో ఆడుకోనీయరాదు.
* రోజూ అయిదు నుంచి ఆరు లీటర్ల వరకు స్వచ్ఛమైన నీటిని తాగాలి. అయిదేళ్ల పిల్లలైతే కనీసం రెండు నుంచి మూడు లీటర్లకు తగ్గకుండా మంచినీరు తాగేలా తల్లిదండ్రులు జాగ్రత్తపడాలి.
* నీరు బాగా తాగడం వల్ల చెమట రూపంలో శరీరంలోని మలినాలు బయటకు వెళ్లిపోతాయి. కిడ్నీలో రాళ్లు ఏర్పడడానికి అవకాశం ఉండదు.
* శీతల పానీయాల కంటే మజ్జిగ, కొబ్బరి బోండాల్లోని నీరు తాగడం శరీరానికి, మనస్సుకు ఎంతో శ్రేయస్కరం.
* ఫ్రిజ్ వాటర్ కంటే కుండల్లో పోసే నీరు ఎంతో సురక్షితం. ఎందుకంటే కుండలు నీటిలోని దుమ్ము, ధూళి, మట్టి కణాలను పీల్చుకుని సురక్షితమైన నీటిని ఇస్తాయి.
* బిందెడు నీటిలో రెండు క్లోరిన్ బిళ్లలు వేస్తే రక్షిత నీటిగా మారుతుంది.
* శీతల పానీయాల్లో వాడే ఏ రకమైన రంగులైనా అవి ఆరోగ్యానికి హానికరమే. రంగులు కలిపిన పానీయాలను సాధ్యమైనంత వరకు తీసుకోవద్దు.
* వడదెబ్బ తగిలిన వ్యక్తి బట్టలు మొదటవదులు చేసి గాలి వెలుతురు బాగా ప్రసరించే ప్రదేశంలో పడుకోబెట్టాలి. చల్లని నీటిలో అద్దిన బట్టతో శరీరమంతా తుడవాలి. శరీరమంతా చల్లదనం కలిగేలా చేయాలి.
* సాధ్యమైనంత వరకు తీసుకునే రసాల్లో, పానీయాల్లో ఐస్ ముక్కలు లేకుండా చూసుకోవాలి.
* మనం తాగేది సురక్షితమైన నీరు కాకపోతే డయేరియా, టాన్సిల్స్, గొంతు సంబంధమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

బొప్పాయి విత్తులతో కల్తీ మిరియాలు

బేగంబజార్‌లో హోల్‌సేల్ దందా

సిటీబ్యూరో, మార్చి 14 (నమస్తే తెలంగాణ): బొప్పాయి విత్తులు, ఇతర రసాయనాలతో నకిలీ మిరియాలు తయారుచేసి విక్రయిస్తున్న బేగంబజార్‌కు చెందిన వ్యాపారిని సౌత్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. అదనపు డీసీపీ శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం.. బేగంబజార్‌కు చెందిన వినోద్‌కుమార్ గెహ్లాట్ అలియాస్ వినోద్ గెహ్లాట్ స్థానిక ఫిష్ మార్కెట్ సమీపంలో వినోద్ ట్రేడింగ్ కంపెనీ పేరుతో కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఇందులో కల్తీ ఆహారపు వస్తువులు విక్రయిస్తున్నారనే సమాచారమందుకున్న ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి బృందం.. దుకాణంపై దాడి చేసింది. 700 కిలోల కల్తీ మిరియాలు లభించాయి. వీటిని నగరంతోపాటు కర్ణాటక రాష్ట్రానికి కూడా సరఫరా చేస్తూ భారీ లాభాలు ఆర్జిస్తున్నట్లు తేలింది. నిందితుడిని అరెస్ట్ చేసి తదుపరి విచారణకు షాహినాయత్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.